## క్లుప్తంగా

### నేడు ఉచిత వైద్య శిబిరం

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గురువారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీబీ, ఎయిడ్స్, మలేరియా, డెంగీ, రక్తహీనత, మధుమేహం, రక్తపోటు తదితర వైద్య పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఎక్సరే తీస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**మంచాల:** అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో మండల పరిధి 93 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్దన్‌రెడ్డి, గుండమోని జయమ్మ, మండల అధ్యక్షుడు రాంరెడ్డి మండల నాయకులు రమాకాంత్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, ఎడ్మా నరేందర్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, మహేందర్, మిద్దె శ్రీనివాస్ గౌడ్, జయానందం, ఐల్లయ్య, చంద్రయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**కడ్తాల్:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా ప్రభుత్వం.. అందరికీ ఇంటిని నిర్మించి ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు వెంకటేశ్, శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### పేదవారికి ఇళ్లు కేటాయించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**కడ్తాల్:** గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్ దోనాదుల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. ఇల్లులేని వారిని గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చాలని కోరారు. లేని పక్షంలో పేదల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం అధికార ప్రతినిధి భగీరథ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్, నాయకులు మాన్యనాయక్, యాదగిరి, సిద్దిగారికుమార్, ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, విక్రాంత్ చారి, శ్రీను తదితరులు ఉన్నారు.

### ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**యాచారం:** మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో నలుగురికి ఇళ్లు మంజూరు అయ్యాయని, లబ్ధిదారులు త్వరగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు బడె కుమార్, తాండ్ర చిన్న, యాదయ్య, సంగెం రవి, ఎట్టి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# సాగుకు సమాయత్తం

- దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- విత్తేందుకు అదును కోసం చూస్తున్న కర్షకులు
- నారుమడులను సిద్ధం చేసుకుంటున్న వైనం



ఆరుట్లలో వరి నారుమడి

**మంచాల:** తొలకరి జల్లులతో వానాకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. ఇప్పటికే దుక్కులుదున్ని సిద్ధంగా ఉంచుకున్న అన్నదాతలు.. అదును చూసి విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. సాధారణంగా వరి సాగు రోహిణి కార్తె నుంచి ప్రారంభమవుతుంది. అంటే మే 25 నుంచి జూన్ 25 లోపు నారు పోస్తారు. జూలై 15 వరకు వరి నారు చేతికి వస్తుంది. అనంతరం నాటు వేస్తారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులు వరి నార్లు పోశారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో వరి 6,800 ఎకరాలు, పత్తి 2,500, కందులు 700, జొన్నలు 1400, కూరగాయలు 400 ఎకరాల్లో సాగు కానుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఎరువులు రెడీ**

మంచాల ప్రాథమిక వ్యవసాయ రైతు సహకార సంఘం(పీఏసీఎస్)లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వరి బీపీటీ(5204) రకం 25 కిలోల సంచి ధర రూ.1138, ఆర్ఎన్ఆర్ (టీఎస్- 15048) 25 కిలోలు రూ.1165లకు విక్రయిస్తున్నారు. గ్రోమోరు 50 కిలోలు రూ.1700, యూరియా 45 కిలోలు రూ.270లుగా ఉంది. ఇక్కడే కాకుండా ఆరుట్లలో ఒకటి, మంచాలలో మూడు, లోయపల్లిలో మూడు ఫర్టిలేజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

### కల్తీపై ఉక్కుపాదం



గ్రామాల్లో కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వ్యవసాయ శాఖ, పోలీసులు సమన్వయంతో నిఘాపెట్టాం. రైతులు విడిగా (లూజు)విత్తనాలు కొనుగోలు చేయవద్దు. నకిలీ, కల్తీ విత్తనాల అమ్మకాలపై సమాచారం ఇవ్వండి.

–లింగస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి, మంచాల

### రాయితీపై విత్తనాలు ఇవ్వాలి



యాసంగిలో భూగర్భ జలాలు తగ్గి నష్టాలను చవిచూశాం. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయాలి. వ్యవసాయ అనుబంధ పరికరాలను రాయితీపై అందించి ఆదుకోవాలి.

– పోలమోని భిక్షపతి, రైతు, తాళ్లపల్లిగూడ

### రైతులకు అందుబాటులో...



మంచాల పీఏసీఎస్ కార్యాలయంలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించడం జరుగుతుంది. నాసిరకం విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి.

– వెదెరె హన్మంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, మంచాల

# యువతుల వివాహాలకు సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

**కడ్తాల్:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ చేయూత నందించారు. బుధవారం మూడు కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు, పట్టు చీరలను బహూకరించారు. మండల కేంద్రానికి చెందిన నర్సింహ- వసంత దంపతుల కూతురు ప్రజ్ఞ వివాహానికి రూ.21 వేలతో పాటు పట్టు చీర, కేశమోని జంగయ్య- యాదమ్మల కుమార్తె మౌనిక పెళ్లికి రూ. 21 వేలు, పట్టు చీర, గుర్లకుంటతండాకు చెందిన అంగోత్‌రమేశ్- నాన్కు దంపతుల తనయ అఖిలకు రూ.21 వేలు, పట్టుచీరను ఆయన కానుకగా అందజేశారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్. మౌనిక, అఖిలకు రూ.5వేల చొప్పున అందజేశారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు లాయక్ అలీ, మార్కెట్ డైరెక్టర్ నరేశ్, అశోక్, సురేశ్, రాంచంద్రయ్య, అంజి, శ్రీకాంత్, రాఘవేందర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

### సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

**కొందుర్గు:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. బుధవారం మండలంలోని అయోధ్యాపూర్‌తండా, రామచంద్రాపూర్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్, చౌదరిగూడ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం.. మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, నాణ్యమైన భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

### కేజీబీవీలో ఇంటర్ ప్రారంభం

- ప్రత్యేకాధికారి పద్మజ్యోతి
- దరఖాస్తులకు ఆహ్వానం



**ఆమనగల్లు:** కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్నాయని కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి బుధవారం తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని విద్యాలయంలో ఇప్పటి వరకు 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు కొనసాగాయని, బాలికల చదువుకు ఆటంకం కలగకుండా ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేసిందని చెప్పారు. ఇంటర్ మొదటి ఏడాదిలో ఎంపీసీ, బైపీసీని ఆంగ్ల మాధ్యమంలో బోధించనున్నామన్నారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇంటర్ బోధించేందుకు గెస్ట్ టీచర్లను ఆహ్వానిస్తున్నామని, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

# భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దు

**ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించవద్దని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎలామోని స్వప్న కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హయత్‌నగర్, శంషాబాద్ మండలాల మధ్యాహ్న భోజన నిర్వహణను తమకు ఇవ్వాలని అక్షయ పాత్ర నిర్వాహకులు ఆయా మండలాల విద్యాధికారులకు దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. పథకాన్ని ప్రభుత్వమే కొనసాగించాలని, ఇతరులకు ఇవ్వరాదని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అక్షయ పాత్ర నిర్వాహకులకు పథకాన్ని అప్పగించే విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చింతపట్ల ఎల్లేష్, భోజన కార్మికులు సరిత, శిరీష, లక్ష్మమ్మ, పద్మ, మంజుల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇళ్లు కేటాయించకపోతే..

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం**

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మాట్లాడుతున్న నాయకులు, లబ్ధిదారులు

**మొయినాబాద్:** మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల క్రితమే డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన అప్పటి ప్రభుత్వం 36 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేసిందన్నారు. కానీ ఇళ్లు కేటాయించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకొని ఇళ్లకు మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, గండిపేట మండల కార్యదర్శి డప్పు ప్రవీణ్‌కుమార్, నాయకులు ప్రభుదాస్, లబ్ధిదారులు ఉన్నారు.

### తైబజార్ వేలం వాయిదా



వేలం పాటలో గ్రామస్తుల వాదోపవాదాలు

**కొందుర్గు:** మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే కూరగాయల సంతకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తైబజార్ వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కార్యదర్శి సురేఖ, ఎంపీఓ విజయ్‌కుమార్ సమక్షంలో జీపీ కార్యాలయం వద్ద వేలం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు హాజరై వేలంను అడ్డుకున్నారు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న వీధిలో కూరగాయల సంత సాగుతోంది. అయితే ఈ సంతను ఉమ్మెంత్యాల రోడ్డుకు మార్చాలని కొందరు.. సంతను ఇలాగే ఉంచాలని మరికొందరు వాదోపవాదాలకు దిగారు. దీంతో అధికారులు వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండల పరిధి బండరావిరాల గ్రామం సర్వే నంబర్ 268లోని మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సుమారు 50 నిరుపేద దళిత కుటుంబాలు ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, భూములు కోల్పోవడంతో జీవనాధారం కోల్పోయారని పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

**21 దరఖాస్తులు**

బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 21 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి, పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. బండరావిరాల సదస్సును ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పరిశీలించారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

**తుర్కయంజాల్:** ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మావోల పేరుతో అమాయక గిరిజన, ఆదివాసీలపై కేంద్రం హత్యాకాండను కొనసాగిస్తుందని ఆరోపించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజల గొంతును నొక్కడంతో పాటు బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో భూభారతి పేరుతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శి డి.కిషన్, కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.అరుణ్ కుమార్, కె.శారద, బి.శంకరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై ఉద్యమిస్తాం



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

**మంచాల:** రైతుల సమస్యలపై ఉద్యమిస్తామని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జాపాల గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా రైతు సమస్యలపై ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే అనేక సంస్కరణలు ప్రభుత్వాలు తెచ్చాయని పేర్కొన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జగన్, ముసలయ్య, సంఘం మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ఖానాపూర్‌లో రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే రంగారెడ్డి



మంచాల: దాద్‌పల్లి సదస్సులో తహసీల్దార్ తదితరులు

# ధరణి మోసం.. భూభారతితో పరిష్కారం

- రైతులు ఆందోళన చెందవద్దు..
- దగాకోరుల భరతం పట్టేందుకే కొత్తచట్టం
- భూ సమస్యలున్నవారు దరఖాస్తుచేసుకోండి
- రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అధికారులు

**ఇబ్రహీంపట్నం:** ధరణిలో జరిగిన మోసాలను అరికట్టేందుకే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ధరణితో పదేళ్లుగా భూములను కొల్లగొట్టిన వారి భరతం పడతామని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ల్యాండ్ మాఫియాను సహించేదిలేదన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి ఖానాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, గతంలో కాంగ్రెస్ హయాంలో ఖానాపూర్‌లో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములపై నెలకొన్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఏమైనా భూ సమస్యలుంటే, ప్రస్తుత సదస్సుల్లో అధికారుల దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సునితారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పాసు పుస్తకాలు ఇవ్వాలి**

ఖానాపూర్‌లోని 79, 43 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను అసైండ్ చేసిన వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం నేతలు సామేల్, ఎల్లేష్, రైతులు యాదయ్య, శంకర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

**చెక్కుల పంపిణీ**

ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెక్కులు అందజేశారు. మండల పరిధిలోని 109 మందికి మంజూరైన ఒక కోటి 9 లక్షల 12వేల 644 రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతారెడ్డి, రెవెన్యూ అధికారులు సువర్ణ, రాజేశ్, ముస్తాఫలు పాల్గొన్నారు.

**కౌలు దారులకు హక్కు కల్పించండి**

**యాచారం:** మండలం నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములను ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. వాటిపై హక్కులు కల్పించి, పట్టాదారు, పాసుపుస్తకాలు అందజేయాలని నస్దిక్‌సింగారం కౌలు రైతులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ కీర్తి సాగర్‌కు ఆ రైతులు వినతి పత్రం అందజేశారు. నస్దిక్‌సింగారంలో భూ సమస్యలపై 44 దరఖాస్తులు అందాయని డీటీ తెలిపారు.

**అర్జీలను పరిశీలిస్తాం..**

**మంచాల:** భూ భారతి సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించి, తగిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ వెంకట ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చిత్తాపూర్, దాద్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దాద్‌పల్లిలో 15, చిత్తాపూర్‌లో 74 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కార్యక్రమాల్లో భూ సమస్యలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ సూచనల ప్రకారం వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దాద్‌పల్లి సదస్సును పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేష్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్ యాదవ్, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

### సర్కారు భూ సమస్య ఉంది..




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** భూ సమస్యల పరిష్కారమే.. రెవెన్యూ సదస్సుల లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ భూముల సమస్య ఉందని తెలిపారు. పొజిషన్, పట్టా ఉన్నప్పటికీ రికార్డుల్లో నమోదు కాలేదని పేర్కొన్నారు. మరికొంత మంది రికార్డుల్లో ఉన్నా.. పట్టా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మిగులు భూముల్లో పట్టాలు ఉండటం ఇబ్బందికరంగా ఉందన్నారు. సదస్సులో 42 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

**ఆ భూమిని పేదలకు పంచాలి**

కప్పపహాడ్ గ్రామంలో 98 ఎకరాల మిగులు భూమిని పేదలకు పంచాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగయ్య, కన్వీనర్ ప్రభుదాస్, శాఖ కార్యదర్శి విఘ్నేష్, దాసు, సురేష్, భిక్షపతి, చెన్నయ్య, యాదయ్య, సంజీవ, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

### మంతన్‌గౌరెల్లిలో ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

**యాచారం:** మండల పరిధి మంతన్‌గౌరెల్లి రెవెన్యూ సదస్సులో ఆ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, సుల్తాన్‌పూర్ రెవెన్యూ గ్రామాల్లో 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టాదారు, పాసుపుస్తకాలు రావడం లేదని, ఇనామ్ భూములకు కూడా ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏళ్లుగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఎం నాయకులు తావునాయక్, చందునాయక్‌ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆర్ఐ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో భూ సమస్యలపై 85 అర్జీలు వచ్చాయని ఆర్ఐ తెలిపారు.